
సాక్షి సూర్యాపేట

సోమవారం, 4, ఆగస్టు, 2025



సాగర్‌కు పర్యాటకుల తాకిడి

కృష్ణమ్మ పరవళ్లను వీక్షించేందుకు ఆదివారం నాగార్జునసాగర్‌కు పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు.

- 8లో



కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం

కాంట్రాక్టర్ల కోసమే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	47,592 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	47,592 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,867 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,604 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

రాజ్యాధికారం సాధించడమే ధ్యేయం



మాట్లాడుతున్న నర్సింగరావు

తిరుమలగిరి(తుంగతుర్తి) : బీసీ వర్గంలోని అన్ని కులాలను ఏకం చేసి రాజ్యాధికారం సాధించడమే మన ఆలోచన సాధన సమితి ధ్యేయమని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు అన్నారు. బీసీల చైతన్యం గ్రామ బాట కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరిలో ఆదివారం మన ఆలోచన సాధన సమితి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలంటే పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు చిత్తశుద్ధితో తొమ్మిదో షెడ్యూల్ సవరణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, మన ఆలోచన సాధన సమితి నాయకులు గిలకత్తుల రాముగౌడ్, చేను శ్రీనివాస్, కందుకూరి ప్రవీణ్, తన్నీరు రాంప్రభు, కడెం లింగయ్య, పులిమామిడి సోమయ్య, భిక్షం, ఆలేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేట అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో సర్వే నిర్వహించి మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, ఏకలక్ష్మి పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

సూర్యాపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిపై కట్టాలనుకుంటున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణను ఎడారిగా మార్చే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాశాడని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యంగా స్పందించి మేమున్నామని ప్రగల్భాలు పలుకుతోందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు కడితే నల్లగొండ, మహబూబ్‌నగర్‌తోపాటు సూర్యాపేట జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలు ఎడారిగా మారుతాయన్నారు.

రాకున్నా.. వచ్చినట్టు

- తప్పుడు హాజరు నమోదు చేసిన పంచాయతీ కార్యదర్శులు
- పంచాయతీ కార్మికుల సెల్‌ఫోన్‌లలో డీఎస్‌ఆర్ యాప్ ఇన్‌స్టాల్
- విధులకు రాకుండానే ఫొటోలు అప్‌లోడ్
- జిల్లాలో 48 మంది కార్యదర్శులకు నోటీసులు



నాగారం : గ్రామ పంచాయతీల్లో పాలన గాడి తప్పుతోంది. కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు రాకున్నా వచ్చినట్లుగా రోజువారీ పారిశుద్ధ్య నివేదిక (డీఎస్‌ఆర్) యాప్‌లో తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు జూలైలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించారు. ఈ క్రమంలో జిల్లాలో 48 మంది కార్యదర్శులు తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. దీంతో వారికి ఉన్నతాధికారులు చార్జ్‌మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

భవనాలు, కుర్చీల ఫొటోలు అప్‌లోడ్..

పంచాయతీ కార్యదర్శులు ఉదయం 11 గంటలలోపు గ్రామానికి వెళ్లి యాప్‌లో తమ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ లోకేషన్‌కు వచ్చి సెల్ఫీ ఫొటో తీసుకుని డైలీ శానిటేషన్ రిపోర్ట్ (డీఎస్‌ఆర్) యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తదుపరి పారిశుద్ధ్య పనులను చేయిస్తూ ఆ ఫొటోలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదే వారి ముఖ గుర్తింపు హాజరు కూడా. కానీ కొందరు యాప్‌లో ఉన్న వెసులుబాటును ఆసరాగా చేసుకొని విధులకు గైర్హాజరవుతున్నారు. యాప్‌లో సెల్ఫీతోపాటు ఏ ఫొటో అప్‌లోడ్ చేసినా ఓకే అని చూపిస్తుండడం వారికి కలిసి వస్తోంది. పంచాయతీ కార్మికుల సెల్‌ఫోన్‌లలో ఈ యాప్‌ను కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇన్‌స్టాల్ చేస్తున్నారు. కార్మికులే తమ ఫోన్‌లలో డీఎస్‌ఆర్ యాప్ ఓపెన్ చేసి కార్యదర్శి హాజరును నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు పంచాయతీ భవనాలు, కుర్చీలు, ఇతర వస్తువులను అప్‌లోడ్ చేస్తున్నారు. మరికొందరు సెల్‌ఫోన్‌లో ఉన్న కార్యదర్శి సెల్ఫీ ఫొటోను మరోఫోన్ ద్వారా ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల పంచాయతీ అధికారులదే. కార్యదర్శుల హాజరు నమోదు ఎంపీఓ లాగిన్‌లో ఉంటుంది. డీఎల్‌పీఓ, డీపీఓలు సైతం తనిఖీ చేయవచ్చు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కార్యదర్శులు తప్పుడు వివరాలను నమోదు చేస్తున్నారు.

నోటీసులు జారీ చేశాం



డీఎస్‌ఆర్ యాప్‌లో తప్పుడు ఫొటోలు నమోదు చేసిన 48 మంది కార్యదర్శులను గుర్తించి చార్జ్ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి. సెలవు పెట్టకుండానే విధులకు గైర్హాజరయ్యే కార్యదర్శులపై చర్యలు తప్పవు.

-కె.యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి, సూర్యాపేట

48 మందికి చార్జ్ మెమోలు, షోకాజ్ నోటీసులు..

జిల్లాలో 486 గ్రామ పంచాయతీల్లో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు, జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మొత్తం కలిపి 475 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు మొదట్లో ఉదయం 9 గంటలకే గ్రామాలకు చేరుకుని పారిశుద్ధ్య పనుల ఫొటోలు యాప్‌లో నమోదు చేసేవారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఉండడంతో సకాలంలో హాజరు కాలేకపోతున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు స్పందించి ఉదయం 11 గంటల వరకు సమయం సడలింపు ఇచ్చారు. కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 11గంటల లోపు విధులకు హాజరై అక్కడ పారిశుద్ధ్య సిబ్బంది చేపడుతున్న పనులను డీఎస్‌ఆర్ యాప్‌లో వారి ఫొటో వచ్చేలా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. కానీ కొందరు కార్యదర్శులు విధులకు హాజరు కాకుండానే పారిశుద్ధ్య సిబ్బంది, సంబంధిత అధికారి ఫొటోను, ఇతర ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. దీనిని గుర్తించిన అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం గ్రేడ్-1 నుంచి 4 వరకు 39 మంది కార్యదర్శులకు చార్జ్‌మెమోలు, నలుగురు జూనియర్ కార్యదర్శులు, ఐదుగురు ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

నీట్ పీజీ ప్రశాంతం



ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థి హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట : నీట్ పీజీ(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫర్ పోస్ట్‌గ్రాడ్యుయేట్) జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. ఆదివారం సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో జరుగుతున్న నీట్ పీజీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో 179 అభ్యర్థులకు గాను 171 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే కోదాడ సన ఇంజనీరింగ్ కాలేజీలో 50 మందికి గాను 44 మంది హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరయ్యారని వివరించారు. ఆయన వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయలత, తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న అధికారులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గుట్టకు పవిత్రోత్సవ శోభ

- నేటి నుంచి మూడు రోజులు ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పవిత్రోత్సవాలకు సిద్ధమైంది. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. యాగ నిర్వహణకు ప్రథమ ప్రాకార మండపంలో యాగశాలను సిద్ధం చేశారు.

విశ్వక్సేన ఆరాధనతో ఉత్సవాలకు శ్రీకారం

సోమవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో అర్చకులు పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ వేడుకతో పాటు రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో రోజు ఉదయం నవకలశ అభిషేకాలు, నిత్య మూర్తి, మూలమంత్ర, శ్రీనృసింహ, సుదర్శన, దేవతా హవనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి విమాన గోపురానికి పూజలు చేసి, శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాలలు ధరింపజేస్తారు. చివరిరోజు బుధవారం మహా పూర్ణాహుతి నిర్వహించి, స్వామి వారికి పవిత్రమాలలను సమర్పించడంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.



ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో యాగశాల

సర్వదోషాలు తొలగిపోవడానికి..

ఏటా శ్రావణమాసంలో స్వామి వారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయంలో సంవత్సరం పొడవునా జరిగే నిత్యారాధనలు, వివిధ రకాల ఉత్సవాల్లో ఏమైనా దోషాలు జరిగినట్లయితే వాటి ప్రాయశ్చిత్తార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు.

స్నేహితుల దినోత్సవం



కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల ప్రభుత్వ గిరిజన కళాశాల వసతి గృహంలో విద్యార్థినులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థినులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. - కోదాడరూరల్

పొగ కష్టాలకు చెక్..!

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలిండర్లు అందించేలా ప్రణాళిక
- ఇప్పటికే 871 స్కూళ్లకు అవసరమని గుర్తించిన అధికారులు



పసునూర్ మోడల్ స్కూల్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు (ఫైల్)

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఇక నుంచి కట్టెల పొయ్యి కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌పీజీ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. కట్టెల పొయ్యితో వంట చేస్తున్న పాఠశాలలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సిలిండర్ల వసతి కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. వర్షాకాలంలో కట్టెలు తడిసి పొయ్యి మండక ఉడికీ ఉడకని భోజనంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు తరగతి గదుల్లోకి పొగ చూరుతోంది. పాఠశాలలకు వంట గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుతో వంట చేయడంలో ఆలస్యం, పొగ సమస్యలు తలెత్తే అవకాశం ఉండదు.

ప్రభుత్వ పాఠశాలలు	871
విద్యార్థులు	42,634
వంట కార్మికులు	1435

871 కనెక్షన్‌లు..

జిల్లాలోని 23 మండలాలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 871 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుండగా 42,634 మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. ఈ పాఠశాలల్లో 1,435 మంది వంట ఏజెన్సీలున్నాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క పాఠశాలలో కూడా ఎల్‌పీజీ కనెక్షన్ లేకపోవడంతో వంట కార్మికులు అన్ని బడుల్లో ఆరుబయట వంట చేస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తోంది. కొన్ని పాఠశాలల్లో వంట పాత్రలు కూడా సరిగా లేకపోవంతో కొన్ని నెలల క్రితం అందజేశారు.

తప్పనున్న ఇబ్బందులు..

ఇటీవల ప్రభుత్వం అన్ని పాఠశాలలకు నాణ్యమైన వంటపాత్రలు అందించింది. అలాగే ఇప్పుడు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనుంది. తద్వారా విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. అన్ని మండలాల పరిధిలో స్థానిక ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మధ్యాహ్న భోజన వండే కార్మికులకు గ్యాస్ సిలిండర్, స్టౌ ఉచితంగా అందిస్తుండగా గ్యాస్ మాత్రం కార్మికులే నింపుకోవాలి. జిల్లాలో 871 పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద వండుతున్నట్లుగా గుర్తించి కనెక్షన్లు మంజూరు చేసింది.

గ్యాస్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తాం



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో 871 ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్‌లు అవసరం ఉన్నట్లు గుర్తించాం. అన్ని పాఠశాలలకు త్వరలోనే గ్యాస్ సిలిండర్లు సమకూర్చుతాం.

– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు సస్పెన్షన్

పెన్‌పహాడ్ : భూ తగాదాలో ఇద్దరిపై దాడి చేసిన హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన శానం వెంకటేశ్వర్లు కుమారులు శానం లక్ష్మణ్‌రావు, నాగేంద్రబాబు అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. జూలై 3న పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామ శివారులో గల వ్యవసాయ భూమి విషయంలో శానం రామలింగయ్య, ఆయన కుమారుడు భరత్‌పై సైకిల్ చైన్లు, గొడ్డలితో హెడ్‌కానిస్టేబుళ్లు దాడిచేసి గాయపరిచారు. ఈ విషయమై బాధితుడు రామలింగయ్య పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎస్‌ఐ గోపికృష్ణ నివేదికను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఆ నివేదికను 12వ బెటాలియన్ కమాండెంట్‌కు పంపారు. దీంతో దాడికి పాల్పడిన హెడ్ కానిస్టేబుళ్లను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు 12వ బెటాలియన్ కమాండెంట్ తెలిపారని డీఎస్పీ వివరించారు.

రెండు నిమిషాల్లో కుల ధ్రువీకరణ పత్రం

- గతంలో తీసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయకుండా వెసులుబాటు
- రూ.45 చెల్లించి మీసేవ ద్వారా పొందే అవకాశం

చిలుకూరు: కుల ధ్రువీకరణ పత్రాన్ని రెండు నిమిషాల్లో పొందడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని మళ్లీ అవసరం ఉన్నప్పుడు తీసుకోవడానికి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మీ సేవ కేంద్రాల్లో ఆధార్ నంబర్ ద్వారా రెండు నిమిషాల్లో తీసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. కులం మారదు కాబట్టి అవసరం ఉన్న వారు నేరుగా మీ సేవ కేంద్రానికి వెళ్లి రూ. 45 రుసుం చెల్లించి ఆధార్ నంబరు ద్వారా తీసుకోవచ్చు.

మీ సేవ పరిధిలోకి కొత్త సేవలు

ప్రజల సౌకర్యార్థం మీ సేవ పరిధిలోకి కొత్త సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఈ సేవలు ప్రైవేట్ సైట్‌లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వీటిని మీ సేవ పరిధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో రెవెన్యూ , అటవీ , సంక్షేమ శాఖలకు సంబంధించిన సేవలు ఉన్నాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి గ్యాప్ సర్టిఫికెట్ , పౌరుని పేరు మార్పు, స్థానికత, మైనార్టీ , క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్ , సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్, మానిటరింగ్, వన్య ప్రాణుల దాడిలో పరిహారం, సామిల్, టింబర్ డిపో, తదితర వాటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వీటితో పాటు హిందూ మ్యారేజ్ సర్టిఫికెట్, నాన్ అగ్రికల్చర్ మార్కెట్ విలువ ధ్రువపత్రం , పాన్ కార్డు సవరణ , ఇసుక బుకింగ్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాల పరిధిలో 23 మండలాలు, ఐదు మున్సిపాలిటీలలో కలిపి 93 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి.



చిలుకూరులో మీ సేవ కేంద్రం

మున్సిపల్ పోరుకు సన్నద్ధం !

- ఏడు నెలలుగా ప్రత్యేక పాలనలో మున్సిపాలిటీలు
- ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుచూపులు
- కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్న నాయకులు
- రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ

తిరుమలగిరి (తుంగతుర్తి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావడంతోపాటు దానికి అనుగుణంగా మున్సిపాలిటీ ఎన్నికలు కూడా జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సమాయత్తం అవుతోంది. జిల్లావ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలు ఉండగా వీటిలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

జనవరిలో ముగిసిన గడువు

ఈ సంవత్సరం జనవరిలో మున్సిపల్ పాలకవర్గాల గడువు ముగిసింది. ఏడు నెలలుగా మున్సిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వార్డుల్లోని సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. పాలకవర్గం ఉన్నంత కాలం పట్టణవాసులు తమ సమస్యలను వార్డు కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే వారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. దీంతో పట్టణ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహిస్తారని తెలియగానే రాజకీయ పార్టీల నాయకులు క్రియాశీలకం అయ్యారు. మున్సిపాలిటీలో పట్టు సాధించాలని ప్రధాన పార్టీల నాయకులు ప్రత్యేక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. కార్యకర్తలను ఇప్పటి నుంచే సన్నద్ధం చేస్తున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ పనుల్లో నిమగ్నమయింది.



తిరుమలగిరి మున్సిపాలిటీ కార్యాలయం

రిజర్వేషన్లపైనే చర్చ..

మున్సిపాలిటీ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఏమేమి వస్తాయోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. చైర్మన్‌తోపాటు వార్డులకు రిజర్వేషన్లు గతంలో మాదిరిగా ఉంటాయా ? లేక కొత్తగా రిజర్వేషన్లు మారుతాయా అని ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండడంతో ఈసారి రిజర్వేషన్లు మారుతాయని భావిస్తున్నారు. గతంలోనే ఆయా మున్సిపాలిటీల పరిధిలో వార్డుల విభజన జరగగా నివాస గృహాలు, జనాభా, కుటుంబాలను గుర్తించాల్సి ఉంది.

మున్సిపాలిటీ	వార్డుల సంఖ్య	నివాస గృహాలు	జనాభా
సూర్యాపేట	48	39128	1,33,339
కోదాడ	35	23572	75,093
హుజూర్‌నగర్	28	10761	35,850
తిరుమలగిరి	15	5447	18,474
నేరేడుచర్ల	15	5156	14,853

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వి

చివ్వెంల(సూర్యాపేట) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల నియంత్రణకు చట్టం లేకపోవడం వల్ల, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం 7 శాతం మించి బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల విద్యారంగం వెనుకబడుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, నవీన్, నితిన్, పవన్, మనీషా, విజయ్, వాజిద్, మహ్మద్ ఆలీ, సైదా, శృతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పృథ్వి

క్లుప్తంగా

స్కూటీని ఢీకొన్న ట్రాక్టర్.. బాలిక మృతి

గుర్రంపోడు : స్కూటీని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బాలిక మృతిచెందింది. ఈ ఘటన గుర్రంపోడు మండలంలోని లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కొండమల్లేపల్లి మండలం చినఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన కూర రాధ, కూర వెంకటయ్య దంపతులు. వీరికి పౌర్ణమి కుమార్తె ఉంది. వెంకటయ్య గ్రామంలోనే వ్యవసాయం చేస్తుంటాడు. రాధ నల్లగొండలోని హాస్టల్‌లో వంట పనులు చేస్తూ కుమార్తె కూర పౌర్ణమి(16)తో కలిసి నల్లగొండలో నివాసం ఉంటుంది. గుర్రంపోడులో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి రాధ తన కుమార్తె పౌర్ణమితో స్కూటీపై వెళ్లి వస్తోంది. ఈక్రమంలో లక్ష్మీదేవిగూడెం స్టేజీ వద్ద వీరి స్కూటీని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న పౌర్ణమి మృతిచెందింది. రాధ తీవ్ర గాయాలతో నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెన్‌పహాడ్: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పానుగోటి సంపత్‌రావు (86) అనారోగ్యం సమస్యతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

రాజాపేట : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది మల్లేశంకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు గడ్డమీది రాజు (25) వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 6గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. తండ్రి మల్లేశం తెల్లవారుజామున 5గంటలకు తన వ్యవసాయ బావివద్దకు వెళ్లి చూడగా పశువుల కొట్టంలో మంచంపై పడి ఉన్నాడు. ట్రాక్టర్ ఫైనాన్స్‌తోపాటు మరోకొన్ని అప్పులు ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు భారీ వచ్చి చేరడంతో ఆదివారం రాత్రి వరకు ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 21,338 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా అవుట్ ఫ్లో 19,000 క్యూసెక్కులు ఉందని పేర్కొన్నారు. 19,000 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సాగర్‌కు పర్యాటకుల తాకిడి

- సుమారు ఐదు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- మధ్యాహ్నం సమయానికి గేట్లు మూసివేయడంతో నిరాశతో వెనుదిరిగిన పర్యాటకులు



లాంచీ వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

నాగార్జునసాగర్: కృష్ణమ్మ పరవళ్లను చూసేందుకు నాగార్జునసాగర్‌కు పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులతో కిటకిటలాడింది. బుద్ధవనం నుంచి సాగర్‌డ్యాం దిగువనగల విద్యుదుత్పాదన కేంద్రం నుంచి రేడియల్ క్రస్ట్‌గేట్ల వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొత్త బ్రిడ్జి, విజయ విహార్, లాంచీస్టేషన్, బుద్ధవనం, పైలాన్‌లోని గ్యాలరీల రోడ్లు, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, బ్యాంకు పార్కు, పైలాన్ శంకుస్థాపన పిల్లర్ నుంచి బస్టాండు మీదుగా జెన్‌కో కార్యాలయం వరకు జనంతో కిటకిట లాడింది. బుద్ధవనం పరిసరాలు, పార్కులు, విజయవిహార్ వెనుక భాగం పార్కులో పర్యాటకులు భోజనాలు చేసి సేద తీరారు. లాంచీ విహారం చేసేందుకు సరిపోయేటన్ని లాంచీలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాంచీ టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. వాహనాల రద్దీ ఉండడంతో కొత్తబ్రిడ్జితోపాటు ఇటు ముత్యాలమ్మ గుడి వరకు వేరే రూట్లలో ట్రాఫిక్‌ను మళ్లించారు.



నదీతీరం వద్ద ట్రాఫిక్ జామ్



పార్కులో సేదదీరుతున్న పర్యాటకులు

నిరాశలో పర్యాటకులు

ఆదివారం ఉదయం 14 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే వరద తగ్గడంతో గేట్లను ఒక్కొక్కటిగా మూసివేస్తూ వచ్చారు. మధ్యాహ్నానికి గేట్లు పూర్తిగా మూసివేయడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.

నీటి విడుదలకు 58 ఏళ్లు

- 1967 ఆగస్టు 4న సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేసిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ




ఎడమకాల్వకు నీటిని విడుదల చేసిన అనంతరం పరిశీలిస్తున్న ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 58 ఏళ్లు పూర్తయ్యాయి. కృష్ణానదిపై నిర్మించిన బహుళార్థకసాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10 నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా 12 సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొణికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండాయి. రైతులు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవ లేకుండా పోయింది. ఆయకట్టుపరిధిలోని గ్రామాలు పట్టణాలుగా మారాయి. మిర్యాలగూడ,కోదాడ,ఖమ్మం లాంటి చిన్న చిన్నగ్రామాలు నేడు పెద్ద,పెద్ద పట్టణాలుగా రూపుదిద్దుకున్నాయి. హాలియా, నేరెడుచర్ల, హుజూర్‌నగర్ లాంటి పల్లెలు నేడు ఆర్థికంగా, వ్యాపారపరంగా అభివృద్ధిపథంలో ఉన్నాయి. జనాభాపెరిగిన మేజర్‌గ్రామ పంచాయతీలు పురపాలక సంఘం నగరాలుగా మారాయి.

ఆశించిన మేర నెరవేరని లక్ష్యం

58 ఏళ్లు గడిచినా అనుకున్న స్థాయిలో ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టు ఆధునీకరణలో కొన్ని ప్రాంతాలకు నీరు చేరువైనప్పటికీ మరికొన్ని ప్రాంతాల్లోని కాలువల చివరి భూములకు నేటికి నీరందడం లేదు. ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న భూములు బీడు భూములుగానే ఉంటున్నాయి. ముందు చూపును దృష్టిలో పెట్టుకుని జలాశయం నుంచి నీటిని అదనంగా తీసుకునే అవకాశం ఉండే విధంగా కాలువ వెడల్పుగా తవ్వలేదు. మెయిన్ కాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి డిస్ట్రిబ్యూటరీల హెడ్ రెగ్యులేటర్ల వరకు, తూములు వెడల్పు చేసి ఇన్‌టెక్ లెవల్‌ను పెంచుకునే అవకాశం లేకుండా పోయింది. ఆనాడు స్థిరీకరణలో తేలని భూములు నేడు సేద్యంలోకి వచ్చి ఆయకట్టు పెరిగింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి అంచనా వ్యయం కేవలం రూ.70కోట్లు కాగా ఆ తర్వాత మరమ్మతులకే వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినప్పటికీ గ్యాప్ ఆయకట్టుకు (టేల్యాండ్) నీరందక పోవడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టు ఆధునికీరణకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయంతో రూ.4,444.44 కోట్లతో ప్రణాళిక తయారుచేసి పనులు ప్రారంభించారు. అయితే సమర్థులైన అధికారులు లేకపోవడంతో 2014లో పూర్తి కావాల్సిన పనులు జూలై 2016లో ముగిసాయి. అప్పుడే కాల్వలకు గండ్లు పడటంతో పాటు లైనింగ్ రూపురేఖలు మారాయి. ఈపనులన్నీ సమర్థవంతంగా పూర్తిచేస్తే, ప్రాజెక్టు లక్ష్యం అనుకున్న స్థాయిలో నెరవేరేది. కాలువల వ్యవస్థ, పారుదల సామర్థ్యం పెరిగి గ్యాప్ ఆయకట్టు సాగులోకి వచ్చేది.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు

కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం నిర్మించారు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు: డబ్బులు, కాంట్రాక్టర్ల కోసమే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా, మేడిగడ్డ వద్ద నిర్మించారని, కాళేశ్వరంలో డిజైన్ లోపం, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందని మండిపడ్డారు. ఆదివారం చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే కాలంలో మునుగోడులోనే కంటి ఆస్పత్రి నిర్మించి ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇది సేవా కార్యక్రమమని, రాజకీయాలతో సంబంధం లేదన్నారు. అన్ని ప్రభుత్వమే చేయాలంటే కష్టమని, భగవంతుడు ఇచ్చిన శక్తి కొద్దీ సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్య, వైద్యం తనకు రెండు కళ్లు అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించే పనులు మొదలుపెట్టామని తెలిపారు. 614 మంది పాల్గొన్న ఈ శిబిరంలో 245 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి, 117 మందిని వెంటనే తరలించగా.. మిగిలిన 128 మందిని మంగళవారం తీసుకెళ్లి ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్‌కు క్యూఆర్ కోడ్



యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో ఉన్న ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రింగ్ రోడ్డులో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆలయ అధికారులు భక్తులకు ఆయా మార్గాలను, ఆధ్యాత్మిక వాడలోని లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, ప్రెసిడెన్షియల్ సూట్, తులసీ కాటేజీ, తదితర ప్రాంతాలను తెలుపుతూ క్యూఆర్ కోడ్‌తో కూడిన రూట్ మ్యాప్ ఫ్లెక్సీలను కొండపైన, కొండ కింద వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేశారు. భక్తులకు సులభతర ప్రయాణం కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామ సమీపంలోని డీప్ కట్ట వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్టకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుంగ పడింది. కాల్వ కట్ట మీదుగా ప్రవహించిన వర్షపు నీరు కాల్వలోకి బుంగ ద్వారా చేరుతోంది. కట్ట కింద భాగంలో బుంగ పడడంతో భవిష్యత్‌లో కట్ట తెగే ప్రమాదం ఉంది. రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారే అవకాశముందని సిరిపురం, చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బుంగను పూడ్చి వేయాలని కోరుతున్నారు.



నడిగూడెం మండలం సిరిపురం ఎడమకాల్వ కట్టపై పడిన బుంగ

సాగు నీరు అందించడంలో పాలకులు విఫలం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : శ్రీశైలం, నాగర్జునసాగర్ ప్రాజెక్టుల గేట్ల ద్వారా నీరు విడుదలవుతున్నప్పటికీ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం అవగాహన లేకుండా నల్లగొండ జిల్లాను ఎండబెడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప కాల్వల ద్వారా పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరందించలేకపోతున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ముందు చూపు లేకే ఈపరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీజన్‌లో నీరందక నల్లగొండ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నకిరేకల్ నియోజవర్గంలో విచ్చలవిడిగా ఇసుక దందా నడుస్తున్నా అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు గుర్రం గణేష్, గోలీ వేణు, మాధవరెడ్డి, కొండ సైదులు, వంటల చేతన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

లారీ బీభత్సం

- వాహనదారులు, పాదచారులపైకి దూసుకువచ్చిన లారీ
- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీ

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో లారీ బీభత్సం సృష్టించింది. జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకురావడంతో ఇద్దరు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలమామిడి రామకృష్ణ(35), చిలమామిడి సాయి కుమార్(22) హైదరాబాద్‌లోని సూరారం కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. రామకృష్ణ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా, సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నిశ్చితార్థం వేడుకకు బంధువులతో కలిసి వచ్చారు. నిశ్చితార్థం జరుగుతున్న క్రమంలో స్వీట్స్ కోసం రామకృష్ణ, సాయికుమార్ ఇద్దరూ కారులో పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాకు బయలుదేరారు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి షాపు దగ్గరకు వెళ్తున్నారు. ఇదే సమయంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఉత్తరప్రదేశ్ నుంచి జగదేవ్‌పూర్ రోడ్డు మార్గం నుంచి చెన్నైకు వెళ్తున్న లారీ వేగంగా దూసుకువచ్చి అక్కడే ఉన్న పాదచారులు, ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. దీంతో అక్కడే నిలబడి ఉన్న రామకృష్ణ మృతి చెందగా, సాయికుమార్‌తో పాటు రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బీమారి శివసాయికుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయికుమార్‌తో పాటు శివకుమార్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సాయికుమార్ మృతి చెందాడు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు, సాయికుమార్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.



రామకృష్ణ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

ధ్వంసమైన షాపులు, బైకులు

లారీ వేగంగా దూసుకురావడంతో రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్, పాన్ షాప్‌లు, అక్కడే ఉన్న మూడు బైకులు ధ్వంసమయ్యాయి. మృతుడు లారీ, గోడ మధ్యన ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇద్దరు అరెస్టు

నల్లగొండ: వాహనాల్లో బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కనగల్ పోలీసులు అరెస్టు చేసినట్లు చండూరు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. కేసు వివరాలను ఆదివారం కనగల్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. కనగల్ మండల పరిధిలోని కేబీ తండా గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కరుణాకర్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రం వద్ద తన మోటార్ సైకిల్‌ను పార్క్ చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. దీంతో కనగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం పోలీసులు కనగల్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వీరిని చూసి వాహనం వెనుకకు తిప్పుకుని వెళ్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితులు నేరం అంగీకరించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బైక్, రూ.లక్షా 45 వేలు విలువ చేసే 20 బ్యాటరీలు, రూ. 24 వేలు నగదు, ఆటో, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సముద్రాల కృష్ణ నల్లగొండలో ఉంటూ కూలి పని చేస్తుంటాడని, మరో నిందితుడు షేక్ టిప్పు సుల్తాన్ అలియాస్ సుల్తాన్ నల్లగొండలో ఉంటూ హౌస్ షిఫ్టింగ్ మూవర్, ప్యాకర్‌గా పని చేస్తాడని పోలీసులు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. కేసును ఛేదించిన సబ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బంది రవీందర్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సురేశ్, రమేష్, వెంకట్ రెడ్డిని చండూరు సీఐ ఆదిరెడ్డి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సూర్యాపేట : సూర్యాపేటలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. రాయినిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (50) ఆదివారం సూర్యాపేట శివారులోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తన సమీప బంధువు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు వేగంగా ఈయన బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన సిమెంట్ ట్యాంకర్

అర్వపల్లి: నకిరేకల్– తానంచర్ల 365 హైవేపై అర్వపల్లి శివారులో తుంగతుర్తి రోడ్డు వెంట ఎస్సారెస్పీ కాలువలోకి ఆదివారం సిమెంట్ ట్యాంకర్ దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి అర్వపల్లి మీదుగా భద్రాచలం వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ సీతారాంపురం సమీపంలో రోడ్డు కల్వర్టును ఢీకొని కాలువలోకి వెళ్లింది. ట్యాంకర్ డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు బయటకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అయితే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మత్స్యగిరి ఆలయ సమీపంలో యాచకుడు మృతి

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో యాచకుడు మృతి చెందాడు. మత్స్యగిరి ఆలయ సమీపంలో లింగస్వామి అనే వృద్ధుడు(65) కొంత కాలంగా యాచకుడిగా కొండపైన జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం యాగశాల వద్ద మృతి చెంది ఉండగా.. గమనించిన సిబ్బంది ధర్మకర్తల మండల చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డికి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి



శ్రీస్వామి దర్శనం కోసం ఆలయ ముఖ మండప క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టింది. భక్తులు అధికంగా రావడంతో ఆలయ మాడ వీధులు, క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి కనిపించింది. శ్రీస్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.44,57,014 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

మినీ శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి చెరువు సమీపంలోని మినీ శిల్పారామంలో ఆదివారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. యాదగిరీశుడి సన్నిధికి వచ్చిన భక్తులు తిరుగుపయనంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి నృత్య ప్రదర్శన తిలకించారు.



ప్రతి భక్తుడికి 30గ్రాములకు తగ్గకుండా ప్రసాదం



పశ్చిమ రాజగోపురం మార్గంలో ప్రసాద వితరణను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం 30 గ్రాములకు తగ్గకుండా అందించాలని ఈఓ వెంకట్రావ్ ప్రసాద విక్రయ విభాగం అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రసాద వితరణను ఆయన పరిశీలించారు. ఆలయ భద్రతకు సంబంధించి ఆలయ లోపలి భాగం, ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టంగా చేయాలన్నారు. ఆలయంపై డ్రోన్స్ ఎగురకుండా నిషేధించుటకు భద్రత సిబ్బందికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. శ్రీస్వామి వారి దర్శనం అనంతరం భక్తులను పశ్చిమ రాజగోపురం నుంచి (ప్రసాద వితరణ మార్గంలో) మాత్రమే బయటకు అనుమతించాలని పేర్కొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆదివారం పోలీసుల తనిఖీలు చేశారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.